క్లుప్తంగా

ఓవరాల్ చాంపియన్స్‌గా ఎంబీటీఎస్



గుంటూరు రూరల్: విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని గోవింద్ అండ్ సన్స్ గ్రూప్స్ అధినేత మేడా మహేంద్ర తెలిపారు. రెండు రోజులుగా నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్‌లో చాంపియన్‌గా టెక్స్‌టైల్స్ టెక్నాలజీ చాంపియన్‌లుగా నిలవగా, గేమ్స్‌లో ఎంబీటీఎస్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.శేఖర్ తదితరులున్నారు.

గణితం సకల శాస్త్రాలకు జనని



గుంటూరు రూరల్: గణితం సకల శాస్త్రాలకు జనని అని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సర్ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి ప్రాచీన కాలంనుంచి గణితంలో సిద్ధహస్తం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా గణిత ప్రొఫెసర్ డాక్టర్ పీ సెల్వరాజును చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, డాక్టర్ రాధా కృష్ణమూర్తి సన్మానించారు.

టైర్ పంక్చరై.. కారు బోల్తా!

గుంటూరు రూరల్: కారు టైర్ పంక్చరై కారు బోల్తా పడిన సంఘటన పొత్తూరు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురంకు చెందిన నలుగురు స్నేహితులు కారులో కోటప్పకొండకు బయలుదేరారు. దేవుడి దర్శనం ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా పొత్తూరు వద్ద టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో వేగంగా వెళుతున్న కారు ఒక్కసారిగా పల్టీలు కొట్టింది. కారులో బెలూన్స్ ఓపెన్ అవ్వటంతో ఎవ్వరికి ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చలపతితో ఆర్‌వీజే పరస్పర ఒప్పందం



గుంటూరు రూరల్: ఫార్మా విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్‌వీజే ఫార్మా కన్సల్‌టెన్సీ చైర్మన్ రవి విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు ఫార్మా, తయారీ పరిశ్రమల్లో అవకాశాలుపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా గ్రాడ్యుయేట్లకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఎన్నో మంచి అవకాశాలున్నాయన్నారు. మంచి కోర్సులు, మంచి కళాశాలలను ఎంచుకుని విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఆర్‌వీజే సంస్థతో చలపతి ఫార్మసీ కళాశాల పరస్పర ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధినేత వైవీ ఆంజనేయులు తదితరులన్నారు.

పేదలను ఆదుకోవడమే నిజమైన క్రిస్మస్



చేబ్రోలు: స్థానిక చెరువు పాలెంలో 100 మంది వృద్ధులు, వితంతువులకు క్రిస్మస్ పండుగ సందర్భంగా చీరలు పంపిణీ కార్యక్రమాన్ని కారుమూరి యశోద ఆనందరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కారుమూరి రాజశేఖర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చెప్పిన విధంగా ఎదుటి వారిని ప్రేమించినప్పుడే మనలను మనం ప్రేమించుకోగలమని ఏసు చూపిన మార్గంలో తోటి వారి పట్ల ప్రేమ దయా కరుణ చూపినప్పుడే అందరికీ మంచి జరుగుతుందన్నారు. చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సహనం శాంతి దయ లాంటి మార్గాలను చూపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో శేకూరు పంచాయతీ కార్యదర్శి బి.ప్రశాంతి, తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్

విద్యావ్యవస్థలో పెనుమార్పులు తెచ్చిన జగనన్న

- శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- శేకూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చేబ్రోలు: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువచ్చారని శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండల పరిధిలోని శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎంఈవో అధ్యక్షత వహించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పాఠశాలల్లో పనులు పూర్తి అయినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు ప్రాధాన్యత ఇచ్చిందని ప్రభుత్వ పాఠశాలలను, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అమ్మఒడి ద్వారా తల్లుల బ్యాంక్ అకౌంట్‌లకు రూ.15 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, గోరుముద్ద తదితర పథకాల ద్వారా విద్యార్థులకు మేలు చేకూర్చుతున్నదన్నారు. అక్షరాస్యత ద్వారా అభివృద్ధి సాధ్యమని విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు.



శేకూరు జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం

పెదకాకాని: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయానికి ప్రారంభోత్సవం, 20 లక్షల వ్యయంతో రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు శుక్రవారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీ మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు గ్రామాలలోనే అవసరమైన అన్ని సేవలు అందుతున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మూడున్నర ఏళ్ళలోనే అన్ని హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ అమలు జరుగుతున్న తీరు పట్ల దేశ వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గుత్తికొండ అంజిరెడ్డి, అన్నాబత్తుని సదా, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, తహశీల్దార్ పి.రత్నం, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, మాదా రాధ, ట్రస్టుబోర్డు చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సయ్యద్ సుబాని, జొన్నల అవినాష్ రెడ్డి, భీమవరపు కోటిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెనిగండ్లలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్

గోరంట్లలో సెమీ క్రిస్‌మస్ వేడుకలు

గుంటూరు రూరల్: ఏసుక్రీస్తు జీవితం ఆదర్శనీయమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని గోరంట్ల హోసన్నా మందిర్ వద్దనున్న సొసైటీ ఫర్ వెల్ఫేర్ హెచ్ఐవి ఇన్ఫెక్టెడ్ పీపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల ద్వారా ఏసుక్రీస్తు సందేశాన్ని నేటి తరానికి తెలియచేయటం జరుగుతుందన్నారు. ఈ ఆధ్వరంలో గత 20 సంవత్సరాలుగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారన్నారు. ఏసుక్రీస్తు జీవితం త్యాగాలమయమని ఆయన ప్రజల పాపాల ప్రక్షాళనకు ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని శాంతి మార్గంలో పయనించాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, సాదు ఉమామహేశ్వరి రాజేష్, గేదెల నాగారం గమని రమేష్, బోగినం ప్రసాద్, సొసైటీ ప్రెసిడెంట్ రామాదేవి, జగదీష్, పాస్టర్ ఆశీర్వాదం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వేడుకలు జరుపుతున్న నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ప్రతి ఆర్‌బీకేలో పంట నష్ట పరిహారం జాబితాలు ఉంచాలి

జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: ప్రతి రైతు భరోసా కేంద్రంలో పంట నష్టపరిహారం జాబితాలను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు–1, ప్రత్తిపాడు–2, తిక్కిరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పంట నష్ట పరిహారం జాబితాలను వ్యవసాయశాఖ సిబ్బంది ఆర్‌బీకేల్లో సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రచురించారు. ఈ జాబితాలను డీఏవో పరిశీలించారు. గ్రామంలో ఎంత పంట దెబ్బతిన్నది. ఎంత మంది రైతులు నష్టపోయారు. పూర్తి వివరాలను స్వయంగా వెళ్లి పరిశీలించారా వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు పంట నష్టపరిహారం జాబితాలను ఒక్కసారి పరిశీలించుకుని, అభ్యంతరాలుంటే ఆర్‌బీకే సిబ్బందిని గానీ వ్యవసాయశాఖ కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.



ప్రత్తిపాడు ఆర్‌బికెలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు

ఎస్టీయూ పోరాటం దశాబ్దాలనాటిది

- జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్. వెంకటరెడ్డి
- ప్రత్తిపాడు ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రత్తిపాడు: ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ దశాబ్దాల తరబడి అలుపెరగని పోరాటం చేస్తుందని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్. వెంకటరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ఎస్టీయూ ప్రత్తిపాడు మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎండి. నజీర్, ప్రధాన కార్యదర్శిగా కె. రవీంద్రబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా కౌన్సిలర్లుగా సీహెచ్. వెంకటరెడ్డి, దారం అంజియ్య, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా కె.పిచ్చేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జి. నాగేశ్వరరావు, పి. వెంకటరావు, సీహెచ్. లక్ష్మయ్య, కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, వై.కోటేశ్వరరావు, పి. జోజి, అదనపు ప్రధాన కార్యదర్శిగా షేక్ మొయిన్ ముల్ హక్, ఆర్థిక కార్యదర్శిగా షేక్ హుస్సేన్ సాహెబ్ ఆర్థిక కమిటీ సభ్యులుగా ఎం శరత్, పి. సుభసుందరం, ఎస్ రజని, మహిళా కన్వీనర్‌గా ఏ. పద్మ, సీపీఎస్ కన్వీనర్‌గా మోహనరావు, మైనార్టీ కన్వీనర్‌గా అబ్దుల్ సత్తార్, గౌరవ సలహాదారుగా ఎ. లింగారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించే యూనియన్ ఎస్టీయూ అన్నారు. నూతన మండలాధ్యక్షుడు నజీర్, ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అండగా నిలుస్తామని చెప్పారు.



నూతన అధ్యక్షుడు ఎండీ. నజీర్



నూతన మండల ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు

ప్రతీ విద్యార్థికి ఉన్నత విద్యే లక్ష్యం

చినలింగాయపాలెం (కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాండ్రపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం మాట్లాడుతూ నేడు ప్రైవేట్ పాఠశాలల కంటే ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయడంతో పాటు 8వ తరగతి నుంచే విద్యార్థులకు సాంకేతిక పరమైన విద్యను అందించాలనే లక్ష్యంతో విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యోహోను, ఎంపీటీసీ జూపూడి ఏసేబు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, విజయ్ భాస్కర్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం

పంట వివరాలు నమోదు చేయాలి



పెదనందిపాడు: మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన పంటల వివరాలు, రైతులు వివరాలను రైతుభరోసా కేంద్రాల వద్ద డిస్‌ప్లే పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పెదనందిపాడు, వరగాని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పంట నష్టం వివరాలను తప్పనిసరిగా డిస్‌ప్లే పెట్టాలని, రైతులు తమ వివరాలు అందులో ఉన్నది లేనిది చూసుకోవాలని ఆయన వారికి చెప్పారు. మిచౌంగ్ తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై శనగ విత్తనాలకు అందిస్తున్నట్లు ఆయన రైతులకు తెలియజేశారు. ఆయన వెంట ఏవో సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

విస్తరణ సేవలపై డిప్లమో కోర్సులు



గుంటూరు రూరల్: డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవలపై డిప్లమో కోర్సును నగరంలోని కృషిభవన్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆదివారం డీలర్లకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆత్మ సంస్థ పర్యవేక్షణలో జరుగుతున్న శిక్షణ తరగతులు ముగియటంతో ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు, డైరెక్టర్ వి. విజయలక్ష్మిలు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జాతీయ ఇన్‌పుట్ డీలర్స్ అసోసియేషన్ కార్యదర్శి వీవీ నాగిరెడ్డి, సమన్వయకర్తలు పాపిరెడ్డి, దేవి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్యం, అప్పుల బాధ తాళలేక మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐపీడీ కాలనీలో నివాసం ఉండే సోమ అరుణ్‌కుమార్ (48) డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో వ్యాపారంలో అప్పులు కావడంతోపాటు, అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపానికి గురైన అరుణ్ కుమార్ ఈనెల 21న ఇంటి నుండి డెకరేషన్ పనులు ఉన్నాయని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు గోడౌన్‌కు వెళ్లి చూడగా పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా

ప్రత్తిపాడు: రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిత్యం ప్రత్యేక నిఘా ఉంచాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా అన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషనులోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి పురోగతికి తీసుకోవలసిన చర్యలపై సీఐ ఎం.వి. సుబ్బారావు, ఎస్ఐ డి. రవీంద్ర బాబులతో చర్చించారు. పెండింగ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓర్పుతో విని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించి ప్రజా జీవితానికి ఆటంకం కలిగించే వ్యక్తులను ఉపేక్షించవద్దని, ప్రత్తిపాడులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్ఐకు స్పష్టం చేశారు. విద్యా సంస్థల్లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.



స్టేషనులో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ షేక్ మహబూబ్ భాషా

వట్టిచెరుకూరులో మండల సమైక్యలకు శిక్షణ

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎమ్ మోడల్‌పై మండల సమాఖ్యలకు శిక్షణ, మెలుకువలు కార్యక్రమాన్ని వట్టిచెరుకూరు మండలం వట్టిచెరుకూరులో నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఆర్‌పీసీ వెంకటరావు మండల సమాఖ్య మహిళలకు శిక్షణనిచ్చారు. ఏటీఎం మోడల్‌లో 18 నుండి 30 రకాల వివిధ పంటలు ఒకే పొలంలో పండించటం జరుగుతుందన్నారు. ప్రతిరోజు సాగు చేసే భూమిలోని ఆకుకూరలు, కూరగాయలు, విక్రయం చేసి నిత్య ఆదాయాన్ని పొందచవ్చన్నారు. ఆరోగ్య కరమైన పంటలను తిని ఆరోగ్యాలను కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పురుగుల మందులు వినియోగించకుండా పండించిన పంటలు తినడం వల్ల మన ఆరోగ్యాలు పిల్లలు ఆరోగ్యం కూడా మెరుగు పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంటి వెంకటరమణ, పీఆర్పి చౌడప్ప, మండల సమైక్య ఈసీ మెంబర్స్ ప్రెసిడెంట్ లక్ష్మి, సభ్యులు వాసంతి, శిరీష, లక్ష్మీతిరుపతమ్మ, రమాదేవి, స్రవంతి, పార్వతి పాల్గొన్నారు.



ఏటీఎం మోడల్ పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

ఉచిత మెడికల్ క్యాంపు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ వై.షేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా.. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ప్రతి ఏడాది చికిత్స చేయించుకునే అవకాశాన్ని కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విలేజ్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్షతో పాటు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి పేదల ఆరోగ్యానికి భరోసానికి కల్పించారన్నారు. సుమారు 100 మంది రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, డాక్టర్స్ విభాగం నేతలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వై. షేక్

అసామాన్యుడు పీవీ నరసింహారావు

లక్ష్మీపురం: సంక్షోభ సమయంలో సరళీకరణ విధానాలను అవలంభించి దేశ ఆర్థిక వ్యవస్థను ఒడ్డుకు చేర్చిన అసామాన్యుడు పి.వి నరసింహారావు అని ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానులు హరి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని పి.వి నరసింహా రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ప్రసంగించారు.

పాటతో పోరాటాలు

నగరంపాలెం: ప్రజా వ్యతిరేక విధానాలపై 'పాట' తన పోరాటాన్ని చేస్తుందని ఇప్టా జాతీయ కార్యదర్శి గని అన్నారు. విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా లాడ్జిసెంటర్ ఏఎల్‌బీఈడీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అభ్యుదయ గీతాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అరసం కార్యవర్గ సభ్యులు ఎంవీఎస్‌ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ధన్యవాదాలు

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. 70 సంవత్సరాల భారత దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని నరేంద్రమోదీ 67,802 సీట్లు కేవలం తొమ్మిదేళ్ల కాలంలో కేటాయించినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయస్థాయి సదస్సు

గుంటూరు రూరల్: ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ అని వరంగ్ ఎన్ఐటీ గణిత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.రాధాకృష్ణమాచార్య తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా రీసెంట్ అడ్వాన్స్‌డ్ ఇన్ మ్యాథమెటికల్ అండ్ స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితశాస్త్రంలో ఆయన ఆలోచనలతో కూడిన లెక్కలు, ఫార్ములాలు ప్రపంచ గణిత శాస్త్రానికి అద్భుత కానుక అని చెప్పారు. రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ధన్బాద్ ఐఐటీ మ్యాథమెటిక్స్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పెంటియాలా శ్రీనివాసరావు, గోవా ఇన్స్టిట్యూట్ అఫ్ మానేజ్మెంట్ బిగ్ డేటా అనలిటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ పి బాలసుబ్రమణ్యం, తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ శ్రీనాథ్‌లు తమ సందేశాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులతో కళాశాల యాజమాన్యం

క్రీడలకు అధిక ప్రాధాన్యత

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీలను ఈ నెల 26 న గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని లయోలా స్కూల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమా వేశ మందిరంలో కమిషనర్ కీర్తి చేకూరి, కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లా డుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడలలో ప్రతిభావంతులను గుర్తించి తగిన ప్రోత్సాహం ఇవ్వనున్నారన్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా గుంటూరు నగరంలోని 206 సచివాలయాల పరిధిలో 40 వేల మందికి పైగా పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని, క్రీడా పోటీలకు అనుగుణంగా నగరంలో 19 గ్రౌండ్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం పోటీల బ్రోచర్స్‌ను ఆవిష్కరించి కిట్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, డి.యస్.డి.ఓ వెంకటేశ్వర రావు, కార్పొరేటర్లు, శాప్, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మనిషికి–ప్రపంచానికి మధ్య అడ్డుగోడ దృష్టి లోపం

- దీన్ని పటాపంచలు చేస్తున్నాం
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ
- రేపు అగతవరప్పాడులో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ



పెదకాకాని: దృష్టిలోపం కేవలం ఒక సమస్య మాత్రమే కాదని మనిషికి ప్రపంచానికి మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేయడానికే బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తుందని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ లోకాన్ని చూడగలిగే అవకాశం దేవుడు అందరికీ ఇచ్చినా అనేక సమస్యలు, లోపాలతో చాలా మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్తోమత, వెనుకబడిన వర్గాల ప్రజానీకం నేత్ర సమస్యలతో జీవితాన్ని ఈడుస్తున్నారన్నారు. మరికొందరు వైద్యంపై సరైన అవగాహన లేక చికిత్స విధానాల గురించి తెలియక ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితులను అధ్యయనం చేసిన బజరంగ్ నేత్ర జ్యోతి వారి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈనెల 17వ తేదీన మండలంలోని అగతవరప్పాడు గ్రామంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరంలో 454 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అవసరమైన 421 మందికి వారి లోపం ఆధారంగా వ్యక్తిగత కళ్లజోళ్లను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఈనెల 24వ తేదీన సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ అగతవరప్పాడు గ్రామంలో 421 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. గ్రామంలో వ్యక్తిగత కళ్లజోళ్లకు అందుబాటులో ఉండి, తమ కళ్లజోళ్లు పొందాలని మురళీకృష్ణ కోరారు.